సాధన వికలాంగుల సేవా సంస్థ సేవలు అభినందనీయం

● రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు జడ్జి చందన

దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జిలు ప్రదీప్, చందన

వలిగొండ, ఆగస్టు 3 : మానసిక దివ్యాంగులకు సాధన మానసిక వికలాంగుల సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి చందన అన్నారు. మండలంలోని టేకులసోమారం గ్రామంలో గల సాధన మానసిక వికలాంగుల సేవా సంస్థను శనివారం సందర్శించి మానసిక దివ్యాంగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేసి మాట్లాడారు. న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, బార్ అసోసియేషన్ కోశాధికారి సాయిదీప్, ఉపాధ్యాయులు మీనాక్షి, కృష్ణమూర్తి, లీగల్ సెల్ అథారిటీ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ హన్మంతు కె.జెండగే

పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హన్మంతు కె.జెండగే

తుర్కపల్లి, ఆగస్టు 3 : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హన్మంతు కె.జెండగే అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి దవాఖానలో ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందులు సరిపోను వస్తున్నాయా.. లేదా? అని ఆరా తీశారు. మందులు పూర్తిస్థాయిలో రావడం లేదని, ఇంజక్షన్లు అందుబాటులో లేవని వైద్య సిబ్బంది తెలుపగా.. వెంటనే ఇండెంట్ పంపించాలని సూచించారు. గ్రామాల్లో డెంగీ ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. దవాఖాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ దేశియా, వైద్య సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : ఎంపీడీఓ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్

ఆలేరు రూరల్, ఆగస్టు 3 : గ్రామాల్లో ఈ నెల 5నుంచి 9వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్ అన్నారు. మండలంలోని కొలనుపాకలో పలు శాఖల అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5రోజులు జరిగే ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల బాధ్యులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కృష్ణయ్య

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 3 : సైబర్ నేరాలు, డ్రగ్స్, దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై శుక్రవారం రాత్రి వివిధ గ్రామాలకు చెందిన యువకులకు డ్రగ్స్, సైబర్ నేరాలను అరికట్టే విధానంపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తమ పరిసర ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు వెంటనే టోల్ ఫ్రీ నెం.1930కి ఫోన్ చేయాలని సూచించారు. డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండి మంచి మార్గంలో నడువాలన్నారు.

'ఆవాజ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి'

శిక్షణా తరగతుల కరపత్రాలను విడుదల చేస్తున్న ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు ఇక్బాల్

త్మకూరు(ఎం), ఆగస్టు 3 : భువనగిరిలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న ఆవాజ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఇక్బాల్, జిల్లా నాయకుడు ఎస్‌కే లతీన్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం శిక్షణా తరగతుల ప్రచార కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. దేశ ఐక్యతను చాటేందుకు జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి లౌకికవాద, ప్రజాతంత్ర వాదులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ అజీమొద్దీన్, మాలీసా హెబ్, అరుణ్, చేతివృత్తిదారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

వివేకానందుడి జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ

విద్యార్థులకు వివేకానందుడి పుస్తకాలను పంపిణీ చేస్తున్న యజ్ఞ ఫౌండేషన్ సభ్యులు

రామన్నపేట, జూలై 3 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానందుడి జీవిత చరిత్ర పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వివేకానందుడి జీవితం, ఆయన సందేశాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. ఆయన చూపిన మార్గాన్ని ఎంచుకొని భావిభారత పౌరులుగా ఎదుగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పాలెం వెంకటేశ్, యాట మహేందర్, ఉదయ్‌కిరణ్, భూమిక, రాణాప్రతాప్ రెడ్డి, పాధ్యాయులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

● కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాములు

అమరుల యాది సమావేశంలో మాట్లాడుతున్న జయరాములు

వలిగొండ, ఆగస్టు 3 : గీత కార్మికుల సంక్షేమానికి ప్రభత్వం కృషి చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగోని జయరాములు అన్నారు. మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అమరుల యాది సభలో ఆయన మాట్లాడారు. గీత కార్మికుల హక్కుల రక్షణ కోసం అమరుల స్ఫూర్తితో సమష్టిగా ఉద్యమించాలన్నారు. కల్లు గీత సంక్షేమం, అభివృద్ధికి, భువనగిరి మండలం నందనం గ్రామంలో నీరా ఉత్పత్తి కేంద్రానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాగీరు కృష్ణయ్య, నాయకులు స్వామి, రాజయ్య, మల్లేశం, సత్తయ్య, అంజయ్య, లింగం, ధనుంజయ, వెంకటేశం, గోపాల్, చంద్రమౌళి, శంకరయ్య, మల్లేశం, మారయ్య పాల్గొన్నారు.

వైభవంగా యాదగిరీశుడి నిత్య తిరుకల్యాణోత్సవం

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. శనివారం ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.15,41,695 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

పాలస్తీనాపై దాడిని ఖండిస్తూ నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండించండి

● వామపక్షాల నాయకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 3 : సామ్రాజ్యవాద దేశమైన అమెరికా సహకారంతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిని మేధావులు, సంఘ సంస్కర్తలు, యావత్ ప్రజానీకం ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి రాచకొండ జనార్దన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ అన్నారు. ఇజ్రాయిల్ దాడిని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని శాంతిభద్రతలు కాపాడాలన్నారు. అమెరికాతో మమేకమైన ఇజ్రాయిల్.. పాలస్తీనాపై దాడి చేసి ఒక తరాన్ని లేకుండా చేయాలనుకోవడం దారుణమని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు పరోక్షంగా మద్దతు తెలుపుతూ పాలస్తీనాపై దాడిని ప్రేరేపిస్తుందని విమర్శించారు. హింస సంస్కృతిని వదిలి ఇజ్రాయిల్ నుంచి పాలస్తీనాను కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, మాటూరు బాలరాజు, అడి వయ్య, సబిత, రమేశ్, నర్సింహ, కృష్ణ, వెంకటేశ్, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, ఎల్లయ్య, అంజయ్య, ముత్యాలు, రాంబాబు, అశోక్, కె.మంజుల, సాజిద్, రియాజ్ పాల్గొన్నారు.

వార్డుల పరిశుభ్రత కోసమే స్వచ్ఛదనం - పచ్చదనం

● భువనగిరి మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, ఆగస్టు 3 : మున్సిపాలిటీల్లోని వార్డుల పరిశుభ్రత కోసమే రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం చేపడుతుందని మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో 35 వార్డుల ప్రత్యేక అధికారులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం ఈ నెల 5నుంచి 9వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వార్డు సభ్యులు, వార్డు అధికారులు, రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేస్తారని, ఆ టీమ్‌కు ఒక ప్రత్యేకాధికారిని కేటాయిస్తారని తెలిపారు. ఆ కమిటీ రోజుకు 7వార్డుల చొప్పున ప్రభుత్వం జారీ చేసిన యాక్షన్ ప్లాన్ ప్రకారం వార్డుల్లో శుభ్రం చేయవలసిన స్థలాలను గుర్తించాలన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ, విద్యాలయాలు, హాస్టళ్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయిల్ బాల్స్ వేయవలసిన ప్రదేశాలు, శుభ్రం చేయవలసిన వాటర్ ట్యాంకులు, ప్రాంతాలు, ఇంకుడు గుంతలు, పెద్ద మురుగు కాల్వలు, నాలాలను గుర్తించాలన్నారు. వీధి కుక్కల సర్వే, శిథిలావస్థకు చేరిన ఇండ్ల గుర్తింపు, పబ్లిక్ ప్రదేశాల శుభ్రం కార్యక్రమాలు చేపడుతారని చెప్పారు. అధికారులు అలసత్వం వహించకుండా పనులు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం : చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ రాజు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, ఆగస్టు 3 : పట్టణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మున్సిపాలిటీలోని 14వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం 10వ వార్డులో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, డీఈ మనోహర, ఏఈ వెన్నల్‌కుమార్, కౌన్సిలర్లు సందగళ్ల విజయ, పోలోజు శ్రీధర్‌బాబు, నాయకులు దండ అరుణ్‌కుమార్, బొడిగె బాలకృష్ణ, తాడూరి పరమేశ్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం'

ఆత్మకూరు(ఎం)లో స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 3 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో అనుకూలమైన తీర్పు రావడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కుమ్మరికుంట్ల గణేశ్, మండలాధ్యక్షుడు మేడి శ్రీనివాస్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ మండల కేంద్రంలో శనివారం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏండ్ల పోరాటానికి ఫలితం దక్కినందుకు సంతోషంగా ఉన్నదన్నారు. స్వామి, ఎల్లయ్య, నవీన్, రవీందర్, శంకర్, సుశీల, చంద్రయ్య పాల్గొన్నారు.

రామన్నపేట : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ మండలంలోని బోగారం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మేడి కృష్ణ మాట్లాడుతూ వర్గీకరణ కోసం 23 ఏండ్లు ఎనలేని పోరాటం చేసిన మహోన్నతుడు మంద కృష్ణ మాదిగ అన్నారు.

రమణానందకు శాస్త్రీయ శ్రీచక్ర రూపకర్త బిరుదు

రమణానందకు శాస్త్రీయ శ్రీచక్ర రూపకర్త బిరుదు ప్రదానం చేస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ చెన్నప్ప, విద్యా ఉపాసకులు దుర్గాప్రసాద్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 3 : సిద్ధగురు, శివశక్తి అనుగ్రహ మహా పీఠాధిపతి రమణానంద మహర్షికి ప్రమీలా శక్తి పీఠం ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రీయ శ్రీచక్ర రూపకర్త బిరుదును ప్రదానం చేశారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గల శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో శనివారం అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా రమణానంద మహర్షి మాట్లాడుతూ బాలాత్రిపుర సుందరీ మహాదేవి అనుగ్రహంతో శ్రీచక్ర నిర్మాణంలోని లోపాలను గుర్తించి శాస్త్రీయ పద్ధతిలో రూపకల్పన చేయడం జరిగిందన్నారు. పూర్వం రుషులు శాస్త్రీయంగా రూపకల్పన చేసిన శ్రీచక్ర నిర్మాణాన్ని కలియుగంలో ఛాందసులు మార్పు చేయడం మూలంగా నిజమైన శ్రీచక్రం ఆనవాళ్లు కోల్పోయిందని తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మసన చెన్నప్ప మాట్లాడుతూ సిద్ధగురు రమణ మహర్షి చేపట్టిన శ్రీచక్ర రూపకల్పన సనాతనమైనదని, ఎంతో శాస్త్రీయమైందని అన్నారు. కార్యక్రమంలో విద్యా ఉపాసకులు దుర్గాప్రసాద్, ఉపాసకులు, భక్తులు పాల్గొన్నారు.

వెల్లంకి గ్రామ విద్యార్థినికి నీట్‌లో 643వ ర్యాంకు

కూరెళ్ల వెన్నెల

రామన్నపేట, జూలై 3 : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన కూరెళ్ల కవిత, భిక్షమాచారి దంపతుల కుమార్తె వెన్నెల నీట్‌లో 643వ ర్యాంకు సాధించింది. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నీట్ 2024 మార్కుల ఆధారంగా శనివారం ప్రకటించిన జాబితాలో 643వ ర్యాంకు దక్కింది. ఆమెకు 720 మార్కులకు గానూ 628 మార్కులు వచ్చాయి. వెన్నెలను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కార్తీక్ (ఫైల్)

భువనగిరి అర్బన్, ఆగస్టు 3 : మనస్థాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని శృతినగర్‌కు చెందిన బట్టు కార్తీక్ (16) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కాగా, కార్తీక్ కాలేజీకి సక్రమంగా వెళ్లకపోవడంతో తల్లి శనివారం మందలించింది. దాంతో మనస్తాపం చెందిన కార్తీక్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి రేకుల పైపుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

సాయికుమార్ (ఫైల్)

బీబీనగర్, ఆగస్టు 3 : చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఎస్.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని జాంఉస్మానియాకు చెందిన గుగ్గిళ్ల సాయికుమార్ (22) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. బీబీనగర్‌లోని పెద్ద చెరువు వద్దకు వచ్చి చెరువులో దూకి అత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

స్వచ్ఛదనంలో భాగస్వామ్యం కావాలి : ఎంపీడీఓ

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 3 : ఈ నెల 5నుంచి 9వరకు నిర్వహించే స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేలా విరివిగా మొక్కలు నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, నివాస ప్రాంతాల్లో మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

తుర్కపల్లి, ఆగస్టు 3 : మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన తలారి సత్తయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.35వేల చెక్కును బీఆర్ఎస్ మండల నాయకుడు అన్నారం రాజు శనివారం అందజేశారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సహకారంతో మంజూరైన చెక్కును లబ్ధిదారుడికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదపురం మాజీ ఉప సర్పంచ్ సీస రాజు, భూసాని వెంకటేశ్, సుదర్శన్, మహేశ్, శ్రీకాంత్, నరేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అసెంబ్లీలో అర్చకుల బదిలీలపైనే మాట్లాడాను

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట, ఆగస్టు 3 : అసెంబ్లీ సమావేశాల్లో దేవాదాయ శాఖపై మాట్లాడే అవకాశం వస్తే అర్చకుల బదిలీలపై మాట్లాడానే తప్ప.. దేవస్థాన ఉద్యోగుల బదిలీలపై మాట్లాడలేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన దేవాలయాల ఉద్యోగాలు తమ బదిలీలను ఆపాలని కోరితే ఆ విషయంపైనే మాట్లాడాలని చెప్పారు. యాదగిరిగుట్టలోని తన నివాసంలో బొమ్మలరామారం, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, రాజాపేట మండలాలకు చెందిన 332 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్టలో అవినీతికి పాల్పడిన ఉద్యోగుల బదిలీలను నిలిపివేయాలని తాను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను వేడుకున్నానని బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. యాదగిరిగుట్ట, కొండగట్టు, ధర్మపురి, వేములవాడ ఆలయాలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్చకులు, అధికారుల బదిలీలపై మాట్లాడానని చెప్పారు. ఇబ్బంది పడుతున్న కొంత మంది ఉద్యోగుల బదిలీలను నిలిపివేయాలని కోరానని తెలిపారు. అవినీతి ఉద్యోగులను ఊపేక్షించేదిలేదన్నారు. తెలంగాణ తిరుపతిగా మారిని యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. 1.3 నుంచి 2టీఎంసీల సామర్థ్యంతో గంధమల్ల జలాశయాన్ని నిర్మించాలని, బస్వాపూర్ జలాశయం నిర్మాణంలో తండాలు, గ్రామాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. రూ.210 కోట్లతో 16 కిలోమీటర్ల మిషన్ భగీరథ కాల్వను నిర్మించి ఆలేరు ప్రాంతానికి స్వచ్ఛమైన నీటిని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మండలాధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.

పంచాయతీ పోస్టులను మున్సిపాలిటీలకు బదలాయించాలి

● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది వినతి

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న చౌటుప్పల్ మున్సిపాలిటీ శానిటేషన్ వర్కర్లు

చౌటుప్పల్, ఆగస్టు 3 : మున్సిపాలిటీల్లో విలీనం చేసిన గ్రామ పంచాయతీ శాఖలో తటస్థంగా ఉన్న 317 స్కిల్ పోస్టులను పురపాలక సంఘాలకు బదలాయించాలని మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది కోరారు. ఈ మేరకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి, ప్రొఫెసర్ కోదండరామ్‌కు శనివారం హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో చౌటుప్పల్ మున్సిపాలిటీ శానిటేషన్ వర్కర్లు వినతి పత్రం అందజేశారు. తాము మున్సిపాలిటీల్లో ఉద్యోగాలు నిర్వహిస్తూ మండల పరిషత్తు కార్యాలయం నుంచి జీతభత్యాలు పొందుతున్నామన్నారు. దాంతో పురపాలక శాఖ నుంచి రావాల్సిన ప్రమోషన్స్, బెనిఫిట్స్ పొందలేకపోతున్నామని తెలిపారు. పురపాలక విధులకు సైతం ఆటంకం ఏర్పడుతున్నందున తమను మున్సిపాలిటీలకు బదలాయించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కె.నర్సింహాచారి, గోవర్ధనాచారి, బాలరాజు ఉన్నారు.

ఎమ్మెల్యే దానంపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి : బీఆర్ఎస్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 3 : అసెంబ్లీ సమావేశాల్లో సభా మర్యాదలను కాపాడకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై రౌడీషీటర్ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని లింగరాజుపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ జాగీరు ఎమ్మెల్యే దానం నాగేందర్ అబ్బ సొత్తు కాదని, అందరిదని అన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తరిమికొడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు